## క్లుప్తంగా

### గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

**గుమ్మలక్ష్మీపురం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సబ్జెక్టులకు సంబంధించి గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శ్రీవరం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారంతా ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్సు కాపీలతో కార్యాలయానికి హాజరుకావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 16వ తేదీన ఉదయం 10:30 గంటలకు డెమో ఇవ్వడంతో పాటు ఇంటర్వ్యూ చేయడం జరుగుతుందన్నారు.

### ఓటర్ల నమోదుపై అవగాహన



ప్రశంసాపత్రాలు పొందిన బీఎల్ఓలతో తహసీల్దార్, తదితరులు

**భామిని:** మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్. శివన్నారాయణ ఆధ్వర్యంలో బీఎల్ఓలకు ఓటర్ల నమోదుపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు, బదిలీలపై ప్రత్యేక అధికారులు వి. రవికుమార్, శంకర్నాయుడు అవగాహన కల్పించారు. అనంతరం బీఎల్ఓలకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఏ బాలరాజు, ఆర్ఐ మణి ప్రభాకర్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

### వాహన తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

**సీతంపేట:** స్థానిక అడ్వంచర్ పార్కు సమీపంలో ఎస్సై వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. పాలకొండ - సీతంపేట - కొత్తూరు, దోనుబాయి వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు.

### శిక్షణ

**సీతంపేట:** స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ పురోగతి సూచికలపై సచివాలయ సిబ్బందికి శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్‌డీ సత్యం మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

### ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు

**గరుగుబిల్లి:** ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందివ్వడమే లక్ష్యమని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని పెద్దూరులో ఉపసర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన పారిశుధ్యం, తాగునీటి వసతి ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలోని 2 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన రక్షిత మంచినీటి పథకాన్ని శుభ్రం చేసి, క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు. కాలువల్లో మురుగును తొలగించి, వీధులను శుభ్రం చేయడం ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు. గ్రామస్తులు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

### 'తల్లికి వందనం' మంజూరు చేయండి



తల్లికి వందనం పథకం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న గిరిజన మహిళలు

**జియ్యమ్మవలస రూరల్:** తల్లికి వందనం పథకం మంజూరు చేసి, డబ్బులు ఇవ్వాలని మండలంలోని పెదతోలుమండ పంచాయతీలోని దీసరిగూడ, చాపరాయిగూడ, బాపన్నగూడ మహిళలు కోరుతున్నారు. ఆయా గ్రామాల్లోని మొత్తం 15 మంది తల్లులకు తల్లికి వందనం పథకం నగదు జమకాలేదు. దీంతో వారంతా తమకూ పథకం డబ్బులు వేయాలని శుక్రవారం రోడ్డెక్కారు. ఎన్నిసార్లు సచివాలయానికి వెళ్లినా అధికారులు సరిగా స్పందించడం లేదని, ఇంతవరకు తమకు పథకం రాలేదని కొండగొర్రి మంగమ్మ, ఆరిక అమల, కొండగొర్రి సరస్వతి, కొండగొర్రి కృష్ణవేణి, కె.లైలా, కె.బుచ్చమ్మలు వాపోతున్నారు. ఈ నెల 13వ తేదీతో తల్లికి వందనం పథకానికి దరఖాస్తు గడువు ముగుస్తోందని, అధికారులైనా, ప్రజాప్రతినిధులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అలంకారప్రాయంగా పరిశోధనా స్థానం..

- నూతన వంగడాల పరిచయం లేదు
- కానరాని రైతు శిక్షణ
- 48 ఎకరాల సాగు భూమి ఉన్నా.. ఫలితం సున్నా..



వ్యవసాయ పరిశోధనా స్థానం ముఖద్వారం

**సీతంపేట:** ఏజెన్సీ రైతాంగానికి నూతన వంగడాలను పరిచయం చేసి వారికి పంటల్లో మెలకువలు నేర్పి అధిక ఆదాయం సముపార్జించేలా చూడాల్సిన స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం డీలా పడింది. పేరుకే వ్యవసాయ పరిశోధనం.. కాని పరిశోధనలు చేసిన దాఖాలలు కనిపించడం లేదు. వివిధ రకాల పంటల ప్రయోగాలు చేయడానికి వీలుగా సుమారు 48 ఎకరాల భూమి పరిశోధనా కేంద్రానికి ఉంది. కానీ సాగుచేయక పోవడంతో ఈ ఆవరణ అంతా తుప్పలు, డొంకలతో నిండిపోయింది. దీన్ని వినియోగంలోకి తీసుకువస్తే రైతులకు మంచి ఫలితం దక్కుతుందని అభిప్రాయం ఉంది. అయితే ఇప్పట్లో అది వినియోగంలోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఆమదాలవలస అగ్రికల్చర్ రీసెర్చ్‌స్టేషన్, రస్తాకుంటుబాయి, చింతపల్లి వంటి ప్రాంతాల్లో ఉన్న పరిశోధనా స్థానాలు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం.. కొత్త కొత్త పంట ప్రయోగాలు చేసి పరిచయం చేయడం వంటివి చేస్తున్నాయి. ఇక్కడ మాత్రం అవేవీ లేవు. ముఖ్యంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 18 మండలాలున్నాయి. ఈ పరిధిలో ఉన్న రైతుల ప్రయోజనార్థం ఐదు దశాబ్దాల కిందట సీతంపేటలో వ్యవసాయ పరిశోధనా స్థానం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో సుమారు 20 వేల మంది వరకు రైతులున్నారు. ప్రధానంగా పసుపు, అల్లం, పైనాపిల్, కంది వంటి పంటలు పండిస్తారు. వాటితో పాటు ఖరీఫ్‌లో వరి, రాగుల పంటలు సాగు చేస్తారు. ఇప్పుడిప్పుడే మొక్కజొన్న పంటకూడా విస్తరిస్తోంది.

**ఒకే సైంటిస్ట్‌తో నడుస్తున్న కేంద్రం..**

వ్యవసాయ పరిశోధనా స్థానం ఒకే సైంటిస్ట్‌తో నిర్వహిస్తున్నారు. సీనియర్ సైంటిస్ట్ (హెడ్) పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. ఈ స్థానంలో ఆముదాలవలస ఏఆర్ఎస్ నుంచి ఇన్‌చార్జ్ విధులు నిర్వహిస్తున్నారు. సోయిల్ సైంటిస్ట్ ఒక్కరు మాత్రమే రెగ్యులర్ పోస్టులో కొనసాగుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్ లక్ష్మీనారాయణ కొద్ది రోజుల కిందట మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఇంతవరకు భర్తీ చేయలేదు. మూడు పోస్టులకు గాను ఒక్కరే పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఇక్కడ వ్యవసాయ పరిశోధనా స్థానం ఉన్నట్లా? లేనట్లా? అన్న చందంగా ఉంది. ఈ ఖరీఫ్‌లో వేసే పంటలపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి. వారు పండిస్తున్న పంటలకు సంబంధించి మెలకువలు నేర్పించాలి. అలాగే తెగుళ్ల నివారణ చర్యలు ఎలా చేపట్టాలనే దానిపై శిక్షణ ఇవ్వాలి.

గతంలో వ్యవసాయ పరిశోధనా స్థానంలోనే ఈ శిక్షణలు ఇచ్చేవారు. క్షేత్రస్థాయిలో కూడా సైంటిస్టులు పర్యటించి పంటల్లో వచ్చే తెగులు, నివారణా చర్యలపై వివరించే వారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.



వ్యవసాయ పరిశోధనా స్థానం కార్యాలయం



బీడు భూమిని తలపిస్తున్న సాగుభూమి

**విత్తనోత్పత్తి చేస్తాం..**

11 ఎకరాల్లో వరి వేసి విత్తనోత్పత్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. నర్సరీ వేశాం. ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 వంటి రకాల వరి రకం వేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే సైంటిస్ట్‌ల పోస్టులు భర్తీ అవుతాయని ఉన్నతాధికారులు తెలిపారు.

– సౌజన్య, సోయల్ సైంటిస్ట్, వ్యవసాయ పరిశోధనా స్థానం

**రైతులకు ఉపయోగం లేదు..**

వ్యవసాయ పరిశోధనా స్థానం వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు. ఇక్కడ ఎటువంటి శిక్షణలు లేవు. రైతులకు నూతన విత్తనాల ప్రయోగం చేసి, సబ్సిడీపై సరఫరా చేయాలి. అది కూడా లేదు. కేవలం బోర్డులకు మాత్రమే పరిశోధనా స్థానం పరిమితమైంది.

– ఎస్.తిరుపతిరావు, సర్పంచ్, శంభాం

## అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తాం..

**కొమరాడ:** తల్లిదండ్రులు లేని పిల్లలకు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆశ్రయం కల్పిస్తామని ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి తెలిపారు. మండలంలోని సుంకేస్ గ్రామంలో సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించిన ఆమె..ఇదే గ్రామానికి చెందిన మండంగి గణపతికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షను కోర్టు విధించడంతో అతడి ఎనిమిదేళ్ల కూతురు ఒంటరి అయింది. దీంతో ఆ బాలిక బాధ్యత ప్రభుత్వం చూసుకుంటుందని గ్రామపెద్దలకు ఆమె తెలిపారు. అయితే బాలిక ఆలనాపాలనా ఆమె మేనత్త నల్లమ్మ చూసుకుంటోందని, ఆమెకే ఇవ్వాలని కోరగా లిఖిత పూర్వక పత్రం రాసిచ్చిన అనంతరం ఆ బాలిక బాధ్యతను ఆ బాలిక మేనత్తకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.నీలకంఠం, డీసీపీవో సత్యనారాయణ, కౌన్సిలర్ తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.



అనాథ బాలిక కుటుంబానికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

## పంచాయతీలే పట్టుగొమ్మలు..

**వీరఘట్టం:** దేశాభివృద్ధికి పంచాయతీలే పట్టుగొమ్మలని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పంచాయతీల అభివృద్ధిపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఇంజినీరింగ్ అధికారి డి.కల్యాణిదుర్గ, ఏపీఓ జి.సత్యంనాయుడు, హౌసింగ్ ఏఈ పి.వినోద్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

## వెలుగు కార్యాలయంలో ఆడిట్

**వీరఘట్టం:** మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఈ ఏడాది నిధుల వినియోగంపై శుక్రవారం ఆడిట్ నిర్వహించారు. డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలు, వారి నుంచి వసూలు చేసిన రుణ బకాయిల వివరాలను పరిశీలించారు. అలాగే కార్యాలయం నిర్వహణ ఖర్చులు, జీత,భత్యాలు, తదితర అన్ని వివరాలపై ఆరా తీశారు. ఆడిట్ అధికారులు రవీంద్ర, బలరామ్ తమ బృందాలతో తనిఖీలు నిర్వహించగా.. ఏపీఎం కె.రాము, వీఓఏలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

## మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** కురుపాం వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి, వైస్ చైర్మన్ గార గౌరీశంకరరావు, ఇతర సభ్యులతో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధి లక్ష్యంగా సభ్యులంతా కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.

## విస్తృతంగా మలేరియా నివారణ కార్యక్రమాలు



వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ రామచంద్రుడు

**సీతంపేట:** గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆ శాఖ స్టేట్ అబ్జర్వర్ ఎస్.రామచంద్రుడు అన్నారు. మండలంలోని కుశిమి పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాల్లో దోమల నివారణా మందు స్ప్రేయింగ్ చేపట్టిన తీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. అలాగే మల్లి సీఓఈ కళాశాల, స్థానిక బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించారు. మలేరియా పాజిటివ్ కేసులు వస్తే ఏ విధంగా వైద్యసేవలు అందిస్తున్నారు?, ఫాలోఅప్ ట్రీట్‌మెంట్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో మలేరియా నివారణ సబ్ యూనిట్ ఆఫీసర్ జె.మోహనరావు, కుశిమి పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్, సహాయ మలేరియా నివారణ అధికారి శ్రీనివాసరావు, ఎంటీఎస్ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి కృషి

- జూనియర్ సివిల్ జడ్జి హరిప్రియ



న్యాయవాదులకు సూచనలు చేస్తున్న హరిప్రియ

**పాలకొండ:** కోర్టు కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేయాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి చందక హరిప్రియ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టులో కేసుల రాజీ కోసం మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..న్యాయవాదులు మధ్యవర్తిత్వం తీసుకుని బాధితులకు వేగంగా న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కనపాక సూర్యప్రకాశరావు, బలగ నరసింగరావు, కర్రా రవి, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడదాం..

- ఎమ్మెల్సీ పాలవలస, మాజీ ఎమ్మెల్యే కళావతి



మండల అనుబంధ విభాగాల అధ్యక్షుల పేర్లు వెల్లడిస్తున్న విక్రాంత్, కళావతి

**పాలకొండ రూరల్:** నూతనంగా నియమితులైన వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులు గ్రామ స్థాయిలో ప్రజల పక్షాన నిలబడాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి అన్నారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించిన పేర్లను ప్రకటించారు.

**మండల అనుబంధ విభాగం అధ్యక్షులు**

| | |
|---|---|
| యువజన విభాగం | అల్లు సురేష్ కుమార్ |
| మహిళా విభాగం | వారాడ సరస్వతి |
| రైతు విభాగం | వారాడ దుర్గారావు |
| బీసీ సెల్ | శివ్వాల శ్రీనివాసరావు |
| ఎస్సీ సెల్ | నల్లబారిక గాంధీ |
| ఎస్టీ సెల్ | ఆరిక వెంకటేష్ |
| క్రిస్టియన్ మైనార్టీ | బొత్స పుష్ప |
| విద్యార్థి విభాగం | గవర ప్రవీణ్‌కుమార్ |
| పంచాయతీరాజ్ విభాగం | కరణం బాబ్జీ |
| ఆర్టీఐ విభాగం | లెంక చంద్రమౌళి |
| వలంటీర్స్ విభాగం | నేరడబిల్లి లావణ్య |
| చేనేత విభాగం | పెనుగొండ ఈశ్వరరావు |
| వాణిజ్య విభాగం | శాసుబిల్లి జనార్ధన |
| వైఎస్సార్ టీయూసీ విభాగం | బొత్స గౌరునాయుడు |
| అంగనవాడీ విభాగం | తొర్లపాటి నీరజ |
| సాంస్కృతిక విభాగం | కోట బాబురావు |
| సోషల్ మీడియా విభాగం | తిర్లంగి ఉపేంద్రకుమార్ |
| దివ్యాంగుల విభాగం | గొర్లె యువరాజ్ |
| ప్రచార విభాగం | కనుముల సత్యనారాయణ |

## ఘనంగా ఫ్రెషర్స్ డే

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులను మిగతా సీనియర్ విద్యార్థులు పరిచయం చేసుకుని, ఘనస్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు ఎలా మెలగాలన్న విషయంపై ప్రిన్సిపాల్ డి.భారతి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



అలరించిన విద్యార్థినుల నృత్య ప్రదర్శన

## అర్హులకు అందని తల్లికి వందనం..



పతివాడ ఈశ్వరమ్మ

**వీరఘట్టం:** ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుతున్నా అందరికీ తల్లికి వందనం పేరిట రూ. 15 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి నాయకుల హామీ నీటి మూటగానే మిగిలిపోయింది. మొదటి ఏడాదిలోనే చాలా మందికి పథకం వర్తించలేదు. లేనిపోని కారణాలను చూపిస్తూ అర్హులకు మొండిచేయి చూపించారు. సచివాలయాల్లో ఫిర్యాదులు చేసినా న్యాయం జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని బార్నాలవీధికి చెందిన పతివాడ ఈశ్వరమ్మకు ఇద్దరు ఆడపిల్లలున్నారు. వీరికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల పాటు అమ్మఒడి పథకంలో భాగంగా రూ. 39 వేలు వచ్చింది. కూటమి ప్రభుత్వ హయాంలో ఇద్దరికీ తల్లికి వందనం నగదు వస్తుందని ఆశ పడితే నిరాశే మిగిలింది. వీరి రేషన్‌కార్డులో ఉన్నవారు ఒకరు ఉద్యోగం చేస్తుండడంతో నెలసరి ఆదాయం రూ. 12 వేలు దాటిందనే కారణంతో పథకం వర్తింపజేయలేదు. వాస్తవానికి వీరి కుటుంబంలో ఎవ్వరూ ఉద్యోగం చేయడం లేదు. ఇలా ఎంతోమంది అర్హులకు అన్యాయం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

**సీతంపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 'జనాభా నియంత్రణ - చిన్న కుటుంబాలు' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపాల్ సుశాంత్ జనా మాట్లాడుతూ.. మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు, అపోహలే గ్రామీణ ప్రాంతాల్లో జనాభా పెరుగుదలకు కారణమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుశాంత్ జనా

## కొబ్బరి మొక్కల పంపిణీ

**భామిని:**

జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా వచ్చిన 10 వేల కొబ్బరి మొక్కలను శుక్రవారం పంపిణీ చేసినట్లు ఉపాధి ఏపీఓ రేగిడి బాబూరావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా బారువా నర్సరీ నుంచి మొక్కలు రాగా.. శుక్రవారం 27 మంది రైతులకు 1760 కొబ్బరి మొక్కలు అందించామన్నారు. అలాగే మండలంలోని 103 చెరువుల గట్లపై నాటడానికి 8272 కొబ్బరి మొక్కలు ఉపాధి ఎఫ్ఏలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈసీ రాంబాబు, టీఏలు, ఎఫ్ఏలు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు కొబ్బరి మొక్కలు అందిస్తున్న ఏపీఓ బాబూరావు, సిబ్బంది

## సచివాలయ సిబ్బందికి శిక్షణ

**భామిని:** ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శాసపు వసంతకుమారి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందికి ' పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ (పీఏఐ)పై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, పారిశుధ్య నిర్వహణా చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ అమరాన జగన్నాథం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వసంతకుమారి

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**గుమ్మలక్ష్మీపురం:** ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ట్రైనీ ఎస్సై అఖిల్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం సందర్శించిన ఆయన.. అక్కడి విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనంతో వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పకుండా ధరించాలని, మితిమీరిన వేగంతో వాహనాలతో వెళ్లవద్దని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీవో శ్రీవాణి, అధ్యాపకులు సత్య, తులసి, అశోక్‌కుమార్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్సై అఖిల్

## నేడు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం

**గుమ్మలక్ష్మీపురం:** జియ్యమ్మవలస మండలంలోని చినమేరంగి కోటలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణిల ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2:30 గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా హాజరుకావాలని కోరారు. పార్టీ మరింత బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎలా ఎండగట్టాలన్న అంశాలపై పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేయడం జరుగుతుందన్నారు.

## విత్తన శుద్ధిపై అవగాహన



రైతులతో విత్తనాలు శుద్ధి చేయిస్తున్న దృశ్యం

**గుమ్మలక్ష్మీపురం(కురుపాం):** కురుపాం మండలంలోని సీతంపేటలో విత్తన శుద్ధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ అసోసియేట్ జి.అన్నపూర్ణ రైతులందరితో విత్తనాలు శుద్ధి చేయించారు. బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి వేసుకుంటే విత్తనాల నుంచి మొలక శాతం పెరుగుతుందని, తద్వారా అధిక దిగుబడి వస్తుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ బి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.